

ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 1: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2024జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఢిల్లీ వారు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయులు నేషనల్అవార్డుటీచర్స్ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఎంపిక వివరాలు తెలుసుకుని సంబంధిత ధ్రువపత్రాలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి ఈనెల 15లోగా దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు.



రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

- జిల్లాలో సొసైటీల వారీగా ప్రత్యేక సమావేశాలు
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రైతులు
- సాగుభూమికే ఇవ్వాలంటున్న మెజార్టీ రైతులు
- కౌలు రైతులకూ రైతుభరోసా ఇవ్వాలని వినతులు
- ఈ నెల 4న నివేదిక సమర్పించనున్న అధికారులు



ఇందల్‌వాయిలో ఏర్పాటు చేసిన మహాసభలో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్‌రావు, పాల్గొన్న రైతులు

నిజామాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు బంధు అమలుపై ప్రభుత్వం రైతుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరిస్తోంది. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో ప్రత్యేక మహాసభలను నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరిస్తోంది. రైతుబంధు పథకం అమలుపై సాగు విస్తీర్ణంతోపాటు ఏ రైతులకు అందించాలో అధికారులు వివరాలను సమావేశం ద్వారా తీసుకుంటున్నారు. ఏ రోజుకారోజు నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తున్నారు. ఈ నెల 4లోపు జిల్లాలోని అన్ని సొసైటీల పరిధిలో ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పూర్తి నివేదికను అందించేందుకు సిద్ధమవుతున్నారు. రైతుల నుంచి వచ్చే అన్ని సూచనలు యథావిధిగా పంపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల పరిధిలో సహకార శాఖ ద్వారా ఈ వివరాలను సేకరిస్తున్న ప్రభుత్వం రైతుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా రైతు భరోసాను అమలు చేయనుంది.

రైతుబంధు స్థానంలో రైతుభరోసా

రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పరిధిలో రైతులకు రైతుభరోసా పథకాన్ని అమలు చేయనుంది. ఈ వానాకాలం సీజన్ అమలుకు సన్నద్ధమైన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఎకరాకు రూ.15వేలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత ప్రభుత్వం మొత్తం రైతుల భూములకు రైతుబంధును అందించింది. ఎన్ని ఎకరాలున్నా, సాగుచేయకున్నా పథకాన్ని వర్తింపజేసింది. ఎకరాకు రూ.10వేల చొప్పున రెండు సీజన్లను కలిపి రైతుల ఖాతాలో డబ్బులను జమచేసింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీతోపాటు రైతు బంధు కింద రైతు భరోసా పథకాన్ని ఎన్నికల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలుచేసే ముందు రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి మరింత పకడ్బందీగా అమలుకు ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర సహకార శాఖ ద్వారా గత నెల 29 నుంచి ఈ నెల 4 వరకు అన్ని జిల్లాల్లో సొసైటీల ద్వారా రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 89 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. ఇప్పటివరకు 38సంఘాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. మిగతా మూడు రోజుల్లో అన్ని సొసైటీ పరిధిలో ప్రత్యేక సమావేశాలు పూర్తిచేసి ప్రభుత్వానికి తుది నివేదికను అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

రైతుల భిన్నాభిప్రాయాలు

జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సమావేశాల్లో రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారు. రైతుబంధు స్థానంలో రైతు భరోసాను కొత్త ప్రభుత్వం తీసుకురావడంతో కొంతమంది రైతులు సాగు చేస్తున్న మొత్తం భూమికి రైతుబంధును వర్తింపజేయాలని కోరారు. మరికొంతమంది రైతులు 5 నుంచి 10ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు ఈ పథకం అమలుచేయాలన్నారు. ఇంకా కొంతమంది రైతులు భూమి ఎంతవున్నా సాగుచేసిన భూమికే ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ఈ ప్రత్యేక సమావేశాల్లో ఐటీ చెల్లించే రైతులకు కూడా పథకం వర్తింపజేయాలని సూచించారు. చిన్న ప్రభుత్వోద్యోగులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలన్నారు. వీరితోపాటు కౌలు రైతులకు ఈ పథకం అందిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. మరికొంతమంది రైతులు భూ యజమానులు ఒప్పుకుని హామీ ఇస్తేనే ఈ పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.15 వేలు అందించేందుకు సిద్ధమవుతుండగా, ఇప్పటివరకు నిర్వహించిన సమావేశాల్లో ఆ మొత్తాన్ని రూ.20వేలకు పెంచాలని మరికొంతమంది రైతులు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సమావేశాల్లో రైతులు వెల్లడిస్తున్న అభిప్రాయాలను రాష్ట్ర సహకార శాఖ అధికారులకు పంపిస్తున్నారు. మిగతా సొసైటీల్లో పరిధిలో రైతు సమావేశాలు పూర్తయిన తర్వాత ఈ నెల 4న తుది నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు జిల్లా సహకార శాఖ అధికారులు పంపించనున్నారు. రైతుభరోసా అమలుకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుడుతుండగా సాగుచేసిన మొత్తం భూమికి ఇవ్వాలని కోరుతుండటంతో ఆ వివరాలను ప్రత్యేకంగా అధికారులు పొందుపరుస్తున్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్, సాగుచేయని భూములకు మాత్రం అందరు రైతులు రైతుభరోసా ను ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలను అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. రైతుల అభిప్రాయాలకు అనుగుణంగానే వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 3వరకు మిగతా సొసైటీల్లో సమావేశాలు పూర్తిచేసి ఈనెల 4న తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని శ్రీనివాస్‌రావు తెలిపారు.

మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకే..



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్: రాష్ట్రంలో మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకే రైతుబంధు కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్ సొసైటీ ఆవరణ లో నిర్వహించిన ప్రత్యేక మహాజన సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలు విన్నవించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి నర్సయ్య, జిల్లా ఆడిట్ అధికారి, డైరెక్టర్లు, సెక్రెటరీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

తెరచుకున్న బాబ్లీగేట్లు

- నీటిని విడుదల చేసిన అధికారులు
- అక్టోబరు 28 వరకు నీటి సరఫరా
- కందకుర్తికి పెరుగుతున్న వరద ఉధృతి
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు





నిజామాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువన గోదావరికి విడుదల చేశారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం తెలంగాణకు చెందిన ఎస్సారెస్పీ ఇంజనీర్లతోపాటు కేంద్ర జలసంఘం ఇంజనీర్లు, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన ఇంజనీర్ల ఆధ్వర్యంలో గేట్లను ఎత్తారు. గోదావరి నుంచి వచ్చే వరదను జూలై 1 నుంచి అక్టోబరు 28 వరకు ఎస్సారెస్పీకి వచ్చేవిధంగా సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చింది. ఆ తీర్పుకు అనుగుణంగానే ప్రతి సంవత్సరం ఈ గేట్లను తెరుస్తున్నారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీ, సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ సతీష్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బన్సోత్‌లు సోమవారం బాబ్లీ ప్రాజెక్టుకు వచ్చి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు ఎగువన పడే వర్షాలకు అనుగుణంగా వరద ఎస్సారెస్పీకి రానుంది. ప్రతీ సంవత్సరం గోదావరి నుంచి వచ్చే వరద ద్వారానే ఎస్సారెస్పీ నిండుతోంది. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టును నిర్మించి నీటిని అక్కడి రైతులకు అందిస్తున్నారు. గేట్లు మూసివేస్తే వరద తక్కువగా వచ్చే అవకాశం ఉండటం వల్ల గోదావరి పైననే ఎస్సారెస్పీ నిర్మించడం వల్ల సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలను బట్టి ప్రతీ సంవత్సరం గేట్లను తెరచి అక్టోబరు 28న మూసివేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లను ఎత్తడం వల్ల వరదతో పాటు 1 టీఎంసీ నీటిని ప్రస్తుతం ఉన్న బాబ్లీలోని నీళ్లు ఎస్సారెస్పీకి రానున్నాయని ఎస్ఈ శ్రీనివాస్ గుప్త తెలిపారు. కాగా, నీటి విడుదలతో కందకుర్తిలో క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కందకుర్తికి జలకళ

రెంజల్: మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమంలో గోదావరి వరద నీరు చేరడంతో జలకళను సంతరించుకుంది. మూడు రోజుల నుంచి మహారాష్ట్ర ఎగువన భారీ వర్షం కురవడంతో బాబ్లీ, విష్ణుపురి గేట్లను ఎత్తివేయడంతో కందకుర్తి గోదావరికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నిన్నటి వరకు చుక్క నీరు లేక వెలవెలబోయిన గోదారమ్మ జలకళను సంతరించుకోవడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది.



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు



డీఎస్ చితి వద్ద నివాళ్లు అర్పిస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

కాంగ్రెస్‌కు డీఎస్ చేసిన సేవలు గొప్పవి: మంత్రి సీతక్క

నిజామాబాద్‌అర్బన్, జూలై 1: ఉమ్మడి రాష్ట్రంలో రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని రావడంలో డీఎస్ చేసిన కృషి గొప్పదని కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎప్పుడు మరువదని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం డీఎస్ మృతి అనంతరం వారి కుటుంబసభ్యులను రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్యతో కలిసి పరామర్శించారు. డీఎస్ తనయుడు సంజయ్, సోదరుడు సురేందర్‌తో మాట్లాడారు. డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆయన అందరితో కలిసిమెలసి ఉంటూ ఆప్యాయంగా ఉండేవారని ఆమె గుర్తుచేశారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీలో పనిచేసి అంచెలంచెలుగా రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా ఉండి, అధికారం లేనప్పుడు ప్రతి పక్షంలో ఉండి పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని మంత్రి సీతక్క కొనియాడారు. డీఎస్ కుటుంబానికి పార్టీ ఎప్పుడు తోడుగా ఉంటుందన్నారు. డీ ఎ స కుటుంబం కాంగ్రెస్ కుటుంబమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాజయ్య మాట్లాడుతూ.. డీఎస్ మృతి పార్టీకి తీవ్ర లోటన్నారు. వారి వెంట డీసీసీ అధ్యక్షుడు మానాల, నగర అధ్యక్షుడు కేశవేణు, నగేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ ఉన్నారు. అలాగే ప్రొఫెసర్ కోదండరామ్ డీఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సోదరుడిని కోల్పోయా: బొత్ససత్యనారాయణ

డీఎస్ మృతితో తాను సొంత సోదరుడిని కోల్పోయానని, మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన డీఎస్ అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశాన్ని సందర్శించి ఆయన చితి వద్ద పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్ చిన్న కుమారుడు, ఎంపీ అర్వింద్‌తో మాట్లాడారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. తాను రాజకీయంగా ఎదుగుతున్న దశలో డీఎస్ ఎంతో ప్రోత్సహించారని ఆయన అండదండలతో తాను ఈ స్థాయికి ఎదిగానని గుర్తుచేశారు. ఆయన సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు వెళ్లానన్నారు. ఆయన మృతి తనకు తీరని లోటని బొత్స సత్యనారాయణ అన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నేతలు తాహెర్‌బిన్‌హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, గడుగు గంగాధర్ తదితరులు బొత్స సత్యనారాయణకు స్వాగతం పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

నిరుద్యోగులు ఉద్యమాలు చేయాలే తప్ప..

ప్రాణాలు కోల్పోవద్దు

- ప్రొఫెసర్ కోదండరామ్



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న కోదండరామ్

నిజామాబాద్ అర్బన్, జూలై 1: నిరుద్యోగ సమస్యలపై విద్యార్థులు పోరాటాలు చేయడంలో తప్పు లేదని.. కానీ పోరాటాల పేరుపై ప్రాణాలను కోల్పోవద్దని, అలా ఉద్యమాలు చేయవద్దని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జీవితంలో చదువును మధ్యలో ఆపవద్దని విద్యార్థులకు సూచించారు. విద్య ప్రయాణంలో మొదటి అడుగు ఇంటర్ అని అన్నారు. నిరుద్యోగ సమస్యలపై అమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ దీక్షను విరమించాలని సూచించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాని హామీ ఇచ్చారు. నిరుద్యోగ సమస్యలపై విద్యార్థులు పోరాటాలు చేయడంలో తప్పు లేదని.. కానీ పోరాటాల పేరుపై ప్రాణాలను కోల్పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, సీనియర్ న్యాయవాది ఆశనారాయణ, టీజేఎస్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్ యాదవ్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ లాల్ సింగ్, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో వానరాలు

- మండల ప్రజలను హడలెత్తిస్తున్న వానరాలు
- గుంపులుగా దాడులు చేస్తున్న వైనం
- రోజురోజుకూ పెరుగుతున్న వానర బాధితులు


భిక్కనూరులో వాహనదారులపై దాడి చేస్తున్న దృశ్యం


వాహనదారులకు వెంబడిస్తున్న వానరాలు

భిక్కనూరు, జూలై 1: అడవులను వదిలి గ్రామాల్లోకి చేరిన వానరాల బెడద రోజురోజుకు తీవ్రమవుతుంది. భిక్కనూరు మండలంలోని ప్రజలు వానరాలను చూస్తే జంకుతున్నారు. మండలకేంద్రంతో పాటుగా మండలంలోని దాదాపు అన్నిగ్రామాల్లో వానరాలు చేస్తున్న దాడులు, నష్టాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి వంటసామగ్రి, అన్నం, కవర్లలో దాచిఉంచిన వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటుగా టీవీ కెబుల్, ఫోన్ వైర్లను, ఇంటిపై గూన పెంకలను ధ్వంసం చేయడంతో పాటుగా, ఇంటిపై కప్పిన టార్పాలిన్లను చించివేస్తున్నాయి. కిరాణదుకాణాల్లో, హోటళ్లలో అయితే తిను బండారాలు, ఇతర సామాగ్రిని ఎత్తుకెళ్త దుకాణాల యజమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏవైపు నుంచి అవి వచ్చి దాడి చేస్తాయో తెలియక ప్రజలు బిక్కుబిక్కు మంటున్నారు. వాటిని బెదిరించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే గుంపులు గుంపులుగా వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపర్చుతున్నాయి. వానరాల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఇళ్లకు జాలీ డోర్లు, కిరాణ దుకాణాలకు, హోటళ్లకు ఇనుప జాలీ ఫెన్సింగ్‌ను అమర్చుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలుగ్రామాల్లో వానరాల దాడిలో గత రెండు, మూడు నెలల్లో 30మందికి పైగా గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. ప్రతిగ్రామంలో వానరాల సంఖ్య రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతుంది. వానరాల సమస్యలను పరిష్కరించాలని మండలం లోని ఆయాగ్రామాల ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది.

● గుంపులుగా దాడులు చేస్తున్న వైనం...

ఇటీవల మండలకేంద్రానికి చెందిన మహిళ తన ఇంటిముందు ఉదయం పూట వాకిలీ శుభ్రం చేస్తుండగా వానరగుంపు ఒకసారిగా ఆమెపై దాడికి దిగాయి. దింతో ఆమె చేతికి తీవ్రగాయమైంది. ఇదే గ్రామంలో ఒక వృద్దుడు ఇంటి పక్కనే ఉన్న ఆలయానికి వెళ్తుండగా మూడు, నాలుగు వానరాలు దాడిచేసి గాయపరిచాయి. మండలకేంద్రంలోని తహీసీల్దార్ కార్యాలయం సమీపంలో కార్యాలయంవైపు నడుచుకుంటూ వెళ్లె వారితో పాటుగా వాహనాలపై వెళ్లే వారిపై దాడు చేస్తున్నాయి. ఇలా మండల కేంద్రంతో పాటుగా మండలంలోని దాదాపు అన్నిగ్రామాల్లో వానరాలు గుంపులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తూ ప్రజలు గాయపరుతున్నాయి. చేతిలో కర్రను చూస్తే చాలు వానరం మీదుకు వస్తున్న పరిస్థితి.

● సిద్దరామేశ్వర ఆలయంలో నానా హంగామా

మండలకేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయంలో వానరాలు నానా హంగామా సృష్టిస్తున్నాయి. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. భక్తుల చేతుల్లో ఉన్న కొబ్బరి కాయలను, ప్రసాదాలను మీద దాడిచేసి ఎత్తుకెళ్తున్నాయి. గతంలో ఇదే ఆయలంలో వానరాల నుండి ఉపశమనం పొందేందుకు రెండు కొండెంగలను తీసుకురాగా అప్పట్లో కొంత సమస్య పరిష్కారం అయ్యింది. ప్రస్తుతం కొండెంగలు లేకపోవడంతో వానరాలు మళ్లి ఆలయంలో తిష్టవేశాయి. సిబ్బంది కానీ, భక్తులు కానీ వాటిని వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తే పలువురిపై దాడులు చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి.

● నెల రోజుల్లో 11మందికి చికిత్స...

భిక్కనూరు మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన 11మంది జూన్ నెలలో వానరాల దాడిలో గాయపడి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకున్నారు. వానరాలతో పాటుగా కుక్కల దాడిలో గాయపడిన 16మంది, ఎలుక కరిచిన 8మందికి చికిత్స అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా గత మూడు నెలలుగా 35మందికి పైగా కేవలం వానరాల దాడిలో గాయపడినట్లు సమాచారం.

వానరాలు కరిచిన వెంటనే ఏఆర్‌వీ తీసుకోవాలి

రేబిస్ వ్యాధి ఒక్కసారి సోకితే దానికి చికిత్స లేదు. అందుకే వానరాలతో పాటుగా కుక్కల దాడిలో గాయపడిన వారు వెంటనే ఏఆర్‌వీ ఇంజెక్షన్‌ను తప్పకుండా తీసుకోవాలి. ముందుగా వానరం కానీ, కుక్క కానీ, ఎలుక కానీ కరిచిన ప్రదేశాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం గాయం తీవ్రతను బట్టీ ఏఆర్‌వీ ఇంజెక్షన్‌ను ఇవ్వడం జరుగుతుంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే కామారెడ్డికి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయ్యడం జరుగుతుంది.

- యేమిమా, మండల వైద్యాధికారిణి భిక్కనూరు

మల్లుపేట సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● 50 మీటర్ల దూరంలో ఎగిరి పడ్డ ట్రాక్టర్ ● ఇద్దరు యువకుల మృతి


రోడ్డుప్రమాదంలో మృతి చెందిన యువకులు


రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన ట్రాక్టర్

సదాశివనగర్, జూలై 1:ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనకాల నుంచి లారీ అతివేగంగా ఢీకొనడంతో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు యువకులు మృతి చెందగా.. అతి వేగానికి ట్రాక్టర్ 50మీటర్ల దూరంలో ఎగిరిపడిన సంఘటన సదాశివనగర్ మండలంలోని మల్లుపేట దాబా సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గాంధారి మండలం కాటాడతాండాకు చెందిన దేవిసింగ్(24), రవీందర్(23) తన ట్రాక్టర్‌పై కామారెడ్డికి పనినిమిత్తం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మండలంలోని మల్లుపేట్ శివారులోని దాబా సమీపంలో 44వజాతీయరహదారిపై అదేవైపు వెళ్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ట్రాక్టర్ 50మీటర్ల దూరంలో రోడ్డుకిందకు పడిపోగా.. రవీందర్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా, దేవిసింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా దేవిసింగ్ సైతం మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిపోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యదర్శులు సమయపాలన పాటించాలి

భిక్కనూరు, జూలై 1: గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం తన కార్యాలయంఓలల ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఇంటికి వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, మురికికాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతీ మండళవారం, శుక్రవారం గ్రామంలో ఫాగింగ్ చేయించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాత హరిజనవాడలో రేషన్ దుకాణం ప్రారంభం

భిక్కనూరు, జూలై 1: మండలకేంద్రంలోని పాతహరిజనవాడ లో రేషన్ దుకాణాన్ని సోమవారం కాలనీపెద్దలు, సమాచార హక్కు చట్టం ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలోని రేషన్‌దుకాణాన్ని కొన్నిసంవత్సరాల ఇక్కడి నుండి సుభాష్‌గల్లికి తరలించారు. దీంతో ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోనేవాళ్లమని, సమాచార హక్కు చట్టం కన్వీనర్ రవీందర్, కాలనీలోని యువకులు ఉన్నతాధికారులు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా తిరిగి తమ కాలనీలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సమాచార హక్కు ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

భిక్కనూరు, జూలై 1: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శోభరాణి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ సిబ్బంది సమయ పాటన పాటించాలని, వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి గర్భిణీ ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ క్యాక్రమంలో మండల వైద్యాధికారిణీ యేమిమా, సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్‌లో సంత్ గులాబ్ బాబా జయంతి

బీర్కూర్, జూలై 1:బీర్కూర్ మండల కేంద్రంలోని తోట్ల హనుమాన్ ఆలయ సన్నిధిలో సోమవారం సంత్ గులాబ్ బాబా జయంతి వేడుకలను కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం హారతి కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో గులాబ్ బాబా కమిటీ అధ్యక్షులు మాదప్ప, సంతోష్, రాజు, రాజశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల పనుల పరిశీలన

బాన్సువాడటౌన్ , జూలై 1: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల పనులను సోమవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ పరిశీలించారు. వానాకాలం దృష్ట్యా వైర్లు బయటకు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నార్ల ఉదయ్ , చరణ్‌రెడ్డి , మల్లికార్జున్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చందూర్ నాయకులు

వర్ని,జులై1: బీఆర్ఎస్ పార్టీని వీడి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మొదటిసారి బాన్సువాడకు విచ్చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సోమవారం చందూర్ మండల నాయకులు కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సంతృప్తిగా ఉందని అందుకు ఆ పార్టీలో చేరడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యేతో చెప్పినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అంబర్‌సింగ్, విండో చైర్మన్ అశోక్ యాదవ్, ఎంపీపీ లావణ్య, నాయకులు సాయిరెడ్డి, పోతరాజు శ్రీనివాస్, గుర్ల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని లయన్స్ కార్యవర్గం ఎన్నిక

వర్ని, జులై1 : మండల లయన్స్‌క్లబ్ 2024-25 నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కామెపల్లి ఠాగూర్, సెక్రెటరీగా జాస్తి శ్రీనివాస్ రావు, ట్రెజరర్‌గా కటకం శివరాజులు ఎన్నికయ్యారు. మరో 50 మంది సభ్యులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో భాగంగా వల్లూరి గణపతి సమక్షంలో డాక్టర్స్ డే నిర్వహించారు. వైద్యులు కృష్ణ ప్రసాద్, వంశీకృష్ణలను సన్మానించారు.

అంత్యక్రియలకు యువకుల సాయం

కోటగిరి, జులై 1 : మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన జల్లా సాయిలు అనే వ్యక్తి ఫిట్స్ వ్యాధితో మృతిచెందాడు. కోటగిరికి చెందిన రవి యువసేన ఆధ్వర్యంలో వారు ఆ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు రవి, సంతోష్, వినోద్, యోగేష్, హన్మాండ్లు, కిష్టయ్య, రాజు, ఆనంద్, బ్రాహ్మం పాల్గొన్నారు.

'విధులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

పెర్కిట్, జూలై 1 : పాఠశాల విధులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ పట్టణంలో ఆత్రేయ పాఠశాల యాజమాన్యం సోమవారం ఎంఈవోకు రాజగంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వారికి పలువురి నుంచి నిజనిర్ధారణ లేని ఆరోపణలు వచ్చాయని, ఆ ఆరోపణలకు తగిన సమాధానం చెబుతామని తెలిపారు. అదే విధంగా పాఠశాల విధులకు అటంకం కలిగిస్తూ ఇబ్బందికి గురి చేస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు.

వ్యవసాయ కూలీలకు పింఛన్ ఇవ్వాలి

నందిపేట, జూలై 1: బీడీ, గీతా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నెలకు రూ.2,016 పింఛన్‌ను వ్యవసాయ కూలీలకు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీప్రకారం రైతులకు రూ.12వేల పింఛన్ అందజేయాలని సూచించారు. అంతేకాకుండా బీడీ కార్మికులు, గీతా కార్మికులకు రూ.4,016 పింఛన్‌ను పెంచి ఇవ్వాలని గంగాధర్ డిమాండ్ చేశారు. ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని, రైతులు బంగారు అభరణాలపై తీసుకున్న రుణాలను సైతం మాఫీచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజలింగం, కార్యదర్శి దేవన్న, ఉపాధ్యక్షులు జి.కూషన్న, సభ్యులు వంజరి గంగాధర్, ఉమ్మెడ గంగాధర్ తధితరులున్నారు.

దోస్త్ అడ్మిషన్‌లపై విస్తృత ప్రచారం

మోర్తాడ్, జులై1: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న ఆధ్వర్యంలో సోమవారం దోస్త్ డిగ్రీ అడ్మిషన్‌లకై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ కళాశాల లెక్చరర్‌ల కోసం రెండు రూట్లుగా విభజించుకొని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తూ ఫెక్సీలు ఏర్పాటు చేశారు. దొన్కల్, శెట్‌పల్లి, దర్మోరా, గాండ్లపేట్, బషీరాబాద్, చౌట్‌పల్లి, హసాకొత్తూర్, నాగాపూర్, అంక్సాపూర్ గ్రామాల్లో ఒక బృందం ప్రచారం చేయగా రెండో బృందం తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద, తడ్‌పాకల్, నాగేంద్రనగర్, బట్టాపూర్, గుమ్మిర్యాల్ తాండాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్, స్రవంతి, లెక్చరర్‌లు పాల్గొన్నారు.

'కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలి'

బోధన్‌రూరల్,జులై1: జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ఆ కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని హిట్ అండ్ రన్ కేసులో ఇక కటకటలేనని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఒకరి మృతికి కారణమై ప్రమాద స్థలం నుంచి పారిపోతే 106(2)బీఎన్ఎస్ ప్రకారం రిమాండ్‌కు పంపుతామని, నిరూపణ అయితే 10సంవత్సరాల జైలు శిక్ష తప్పదన్నారు. ప్రమాద స్థలం నుంచి పారిపోకుండా పోలీసుస్టేషన్‌లో, లేదా కోర్టులో లొంగిపోతే నేర నిరూపణ అయితే 5సంవత్సరాల పాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



సుంకెట అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న సొసైటీ పాలకవర్గం

వేల్పూర్, జులై1: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని సొసైటీలో సోమవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డిని సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్‌లు శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా సొసైటీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా అన్వేష్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం సభలో అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. అనంతరం రైతుల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, వ్యవసాయాధికారి నర్సయ్య, సెక్రెటరీ స్వామి, డైరెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ

భిక్కనూరు, జూలై 01: భిక్కనూరు మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, విండో చైర్మన్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి రాజ్యాంగబద్ధమైన హోదాలేని షబ్బీర్‌అలీని అహ్వానించడం ఏమి టని, అతడి స్థానంలో స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డిని ఆహ్వానించిన గౌరవంగా ఉండేదని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యాదగిరి, ఎంపీటీసీలు, విండో చైర్మన్లు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై పల్లకీసేవ, ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌రూరల్, జూలై1: పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టపై సోమవారం పలకీసేవ, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే సిద్దులగుట్టకు తరలివచ్చి శివాలయంలో సిద్దేశ్వరునికి, రామా లయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పైపుల రాజారెడ్డి సిద్దులగుట్టపై నూతనంగా నిర్మించిన షెడ్డులో మార్బుల్ టైల్స్, ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమానికి వంట చేయడానికి వంట గది నిర్మాణానికి దాతగా వ్యవహరించారు. సోమవారం సిద్దులగుట్ట దర్శనానికి వచ్చి పైపుల రాజారెడ్డికి అలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించి గుట్టపై చేపడుతున్న పనులను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డి.సుమన్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, సతీష్, చరణ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, జిమ్మిరవి, కొంతం మురళీ పాల్గొన్నారు.

'వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

బోధన్‌రూరల్,జులై1: అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల పెన్షన్ పెంచుతామని మాట ఇచ్చిందని, వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లు పెంచాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు 4వేల నుండి 6 వేలు పెన్షన్ పెంచాలని, వృద్దులు, వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లు పెంచాలని డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారంరాథోడ్


ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోతో పాటు వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

నవీపేట,జులై1: ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. పలు వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆసుపత్రిలో నార్మల్ డెలవరీల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంత స్థలాన్ని పలువురు అక్రమించుకుంటున్నారని వైద్య సిబ్బంది ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌తో పాటు మెడికల్ ఆఫీసర్లు కావ్య, సామ్రాట్ యాదవ్, అరవింద్‌లను సిబ్బంది శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిషన్, వెంకటేశ్వర్ రావు, ఝాన్సీ ప్రేమలత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



కోటగిరిలో వైద్యాధికారిని సన్మానిస్తున్న దృశ్యం


నందిపేటలో డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్ , జూలై1: పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వనిత, డాక్టర్ భుజంగరెడ్డి, డాక్టర్ హరీష్‌లతో పాటు చార్టడ్ అకౌంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను పట్టుశాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ రాకేష్, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ శ్రీలతలను పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, కార్యదర్శి సంతోష్, అశోక్, చేపూర్ గణేష్, డికె.రాజేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.పట్టణంలోని మెగా టవర్స్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్‌లను సన్మానించి డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ లిఖితలను మెగా టవర్స్ సభ్యులు పట్టుశాలువ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెగా టవర్స్ అధ్యక్షుడు జెస్సు అనిల్, సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు అపర్ణ, ప్రకాష్‌లను శాలువతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో పూర్వవిద్యార్థి డాక్టర్ మౌనికరెడి, డాక్టర్ గణేష్‌రెడ్డిలు డాక్టర్స్ డే సందర్భంగా ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పాఠశాలలో సుమారు 300మంది విద్యార్థులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీ ఫౌం డేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్, డాక్టర్ హరినారాయణ, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వెంకట్‌గౌడ్ దంపతులు, డాక్టర్ ముత్యంరెడ్డి దంపతులు, డాక్టర్ రాజు, డాక్టర్ రాంప్రసాద్; డాక్టర్ అజయ్‌లతో పాటు చార్టర్డ్ అకౌంటెంట్ మారుతి, పవన్‌లను ఆయన పట్టుశాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బెల్దారి శ్రీనివాస్, డిజె.సునీల్, బోడమీది కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో కోటగిరి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యురాలు సుప్రియ, సూపర్‌వైజర్ జ్యోతిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని సభ్యులు కొనియాడారు. వైద్యవృత్తిలోకి వచ్చిన వారు ఎందరో రోగుల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నా వైద్యుల కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షులు హన్మంత్‌రావు, కార్యదర్శి సంతోష్, రవి, శివ చరణ్, మహ్మద్ అలీ, ఉమాకాంత్, సందీప్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని, డాక్టర్‌ల సేవలకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు లక్ష్మీ, పూజ, ఫార్మసిస్టు సంజీవ్‌కుమార్, గంగాధర్‌గౌడ్, ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నందిపేట:మండల కేంద్రంలోని ఆర్మూర్ బైపాస్ రోడ్డులో ఉన్న లయన్స్ భవనంలో సోమవారం డాక్టర్స్‌డేను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌లను నందిపేట లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రైవేట్ డాక్టర్లను సైతం సన్మానించారు. డాక్టర్లు దేవుళ్ళతో సమానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శౌరిబాబు, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ కోశాధికారి నర్సయ్య, సభ్యులు ఉత్తూర్ సురేష్, బద్దం సాయారెడ్డి, పి రాజన్న, గంగోని ప్రేమ్‌కుమార్, మారంపల్లి గంగాగౌడ్, గంగుల జనార్ధన్, డాక్టర్ షాబీర్, నారాయణ, గంగాప్రసాద్, గంగుల గంగాధర్, జగన్ గౌడ్ తధితరులు ఉన్నారు.

పెద్దబజార్: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శిక్షణ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఉన్న వారు దైవంతో సమానమని ప్రజలు నమ్మేలా ప్రజలకు వైద్య సేవలను అందించాలన్నారు. సన్మాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఇరుకుల వీరేశం, లక్ష్మీనారయణ, లింబాద్రి రవీంద్ర నాథ్ గుప్త, చింతల గంగాదాస్, వైద్యులు రాజేశ్, తేజస్వీ, బొద్దుల రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, డీఎల్ఎన్ స్వామి, నీలిరాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : కరోనా కష్టకాలంలో వైద్యుల సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ శక్కర్‌నగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యులను సన్మానించారు. కరోనా మహమ్మారిలో వైద్యులు తమ ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు కాపాడారని వారి సేవలను కొనియాడారు.

'ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తిస్తున్నాం'

ఖిల్లా, జూలై 1 : పోలీసు శాఖలో ఆపరేషన్ ముస్కాన్ కార్యాక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని అదనపు డీసీపీ బి.కోటేశ్వర్‌రావ్ (అడ్మిన్) అన్నారు. రాష్ట్ర అదనపు డీజీపీ మహిళా భద్రతా విభాగం షికాగోయల్ సూచనల మేరకు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ఆదేశాలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సమీక్ష సమావేశం పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో వివిధ శాఖల సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ పరిధిల్లో 18 ఏళ్ల లోపు తప్పిపోయిన/వదిలివేయబడిన/కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని సేకరించి రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని, బలవంతంగా భిక్షాటన చేయించిన, వెట్టిచాకిరి చేయించిన వారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకం గా డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం తప్పిపోయిన బాలబాలికలున్నట్లయితే డయల్ 100కు ఆయా పోలీసుస్టేషన్ల పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్, యాంటిహ్యూమన్‌ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా లేబర్‌ఆఫీసర్ యోహన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ, డీఎమ్‌హెచ్‌వో తుకారాం రాథోడ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య, ఆర్ఎస్ఐ స్రవంతి, హన్మాండ్లు, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి సర్కిల్ టోర్నీ విజేతగా పురాణిపేట్ టీమ్

భీమ్‌గల్ రూరల్, జూలై01 : మండలంలోని పురాణిపేట్ గ్రామంలో వారం రోజులుగా నిర్వహించబడుతున్న సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొన్నాయి. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌ను ఎంచుకున్న బాబాపూర్ జట్టు నిర్ణీత 6 ఓవర్లలో 65 రన్స్ చేయగా ఆ లక్ష్యాన్ని పురాణిపేట్ టీం 5.3 ఓవర్లలో చేజించింది. మొదట బహుమతి పొందిన పురాణిపేట్ టీంకు ముఖ్య అతిధిగా విచ్చేసిన దైడి సురేష్, సుంకరి గాంధీ విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా 8 వేలు, రెండవ బహుమతిగా 4 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా దైడి సురేష్ మాట్లాడుతూ ఆటలో గెలుపుఓటములు సహజమని, ఓడిన వారు గెలుపుని స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని అన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్‌రూరల్,జులై1: బోధన్ పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా నాగేశ్వర్ రావు, కార్యదర్శి ఉమేష్ షిండే, కోశాధికారిగా పండును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, లయన్స్ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లోని గ్రామాలలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వర్ రావు మాట్లాడుతూ లయన్స్ సేవలను విస్తృతం చేస్తామని, నిరుపేదలకు సహయ, సహకారాలు అందించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే సహకారంతో బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలి

● జక్రాన్‌పల్లి మండలం మహాజన సభల్లో రైతులు

జక్రాన్‌పల్లి, జూలై1: పది ఎకరాల వరకు పంట సాగు భూములకే రైతు భరోసా పథకంపై రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుభరోసా కింద సహాయం అందించాలని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. సోమవారం మండలంలోని అర్గుల్, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్ విండోలలో, అలాగే కొలిప్యాక్ సింగిల్‌విండో పరిధిలోని కలిగోట్ రైతువేదికలో విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, అన్వేష్‌రెడ్డి, నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక విండో మహాజన సభలను నిర్వహించారు. అర్గుల్‌లో జరిగిన మహాజన సభలో రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పంట సాగు కోసం పెట్టుబడి కింద రైతు భరోసా పథకంలో రైతులకు అందించే సహాయాన్ని పది ఎకరాల వరకు పంటలు సాగు చేసుకునే భూములకే రైతు భరోసాను ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను డీసీవోకు శ్రీనివాస్‌రావుకు వివరించారు. గుట్టలు, వెంచర్‌లు, సాగులో లేని భూములకు రైతుభరోసా ఇవ్వవద్దని రైతులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని డీసీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ లు ఆర్మూర్ గంగారెడ్డి, అన్వేష్‌రెడ్డి, నాగుల శ్రీనివాస్, వ్యవసాయాధికారిణి దేవిక, క్లస్టర్ అధికారి పోశన్న, ఆడిట్ అధికారి రమేష్, మానిటరింగ్ అధికారి ఆనంద్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అప్పాల నడ్పి రాజన్న, సీఈవోలు కొత్త దయాసాగర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

యానంపల్లిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

డిచ్‌పల్లి, జులై 1: పక్కా సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచిన గదిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేసి గదిని పరిశీలించారు. అప్పటికే గదిలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పలువురు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు తెలిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వ హించారు. అద్దెకు ఇచ్చిన గది యాజమాన్యంతో మాట్లాడి బియ్యం నిల్వలను నిల్వ ఉంచితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ బియ్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి తమకు సమాచారం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి సూచించారు.

నగరంలో నేలకొరిగిన భారీ వృక్షం


నేలకొరిగిన భారీ వృక్షం

సుభాష్‌నగర్, జూలై, 1: నగరంలో భారీ వృక్షం నేలకొరిగింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వృక్షం నేలకొరిగింది. నగరంలోని బస్వాగార్డెన్‌కు వెళ్లేదారిలో భారీవృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు ఇబ్బంది కలిగింది. దశాబ్దాలుగా భారీ వృక్షం ఎలాంటి గాలివాన లేకుండానే పడిపోవడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అటువైపుగా వృక్షం కిందపడినప్పుడు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జేసీబి సహాయంతో సిబ్బంది వృక్షాన్ని తొలగించారు

అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే : ధన్‌పాల్


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్దబజార్, జూలై, 1:నగరంలోని కోటగల్లీలో గల కోటమైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్లేనని తెలిపారు. కోటగల్లి అమ్మవారి ఆశీర్వాదం అందరి ప్రజలపై ఉండాలని, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యలతో ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ వాసులు అర్బన్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కన్వీనర్ సిరిగాద ధర్మపురి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి పన్నాటి కార్తిక్, నర్సింగ్, చింతకాయల రాజేందర్, భూలక్ష్మి, గంగామణి, నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. .

'బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా పింఛన్లు ఇవ్వాలి'

పెద్దబజార్, జూలై, 1 : బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతీ శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతభూమేశ్వర్, ప్రధానకార్యదర్శి సూర్యశివాజీలు అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 8నుంచి 15 వరకు అన్ని జిల్లాలో కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలో వస్తే బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4వేలకు ఇస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించారని అన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెరగడం లేదని అన్నారు. గత 14ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు జీవో విడుదల చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల రాములు, ఖాజామోయినోద్దీన్, గంగాధర్, జెపీ గంగాధర్, శివకుమార్, రాజేశ్, పద్మ, సుప్రీయ, దేశెట్టి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా, జూలై, 1 : వివిధ కారణాలతో పోగోట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు సోమవారం మూడోటౌన్ ఎస్ఐ.ఎల్.ప్రవీణ్‌కుమార్ అందించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని సీఈఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుని వాటిని ట్రాక్‌చేసి గుర్తించడం జరిగిందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గుర్తించిన మొత్తం 13 సెల్‌ఫోన్లను వారి వారికి ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని గుర్తించడంలో ప్రతిభ కనబర్చిన మహిళ కానిస్టేబుల్ సుమలతను సీఐ.నరహరి అభినందించారని తెలిపారు.

బాల్కొండ ఎస్సైగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్

ముప్కాల్, జులై1: బాల్కొండ నూతన ఎస్సైగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై గోపి నిర్మల్‌కు బదిలీ కాగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని అందరి సహకారంతో చట్ట పరిధిలో పని చేస్తానని తెలిపారు.

టీయూ హాస్టళ్లకు కొనసాగుతున్న మరమ్మతులు

డిచ్‌పల్లి,జులై 1: తెలంగాణ విశ్వవిద్యాలయంలో హాస్టళ్లల్లో మౌలిక వసతుల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు. ప్రతి ఏడాది వర్సిటీలో హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపడుతామని అందులో భాగంగా ఈ ఏడాది మరమ్మతులు చేపట్టామని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల నిమిత్తం విద్యార్థుల కోరిక మేరకు వీసీ ఆదేశాలతో ఈ సంవత్సరం వేసవి కాలంలో సెంట్రల్ లైబరిలో కూలర్లుఏర్పాటు చేయించి పుస్తకాలను ఉంచి తెరిచి ఉంచమని తెలిపారు. పోటీ పరీక్షలకు అర్హత లేక సిద్ధంగా లేని విద్యార్థులు సొంత ఇళ్లకు వెళ్లిన్నందున ఆ రూములకు తాళం విద్యార్థులు వేయడంతో ఆ గదులకు మరమ్మత్తులు చేయాలేదని త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిచ్‌పలి,జులై 1: అన్ని గ్రామాల కార్యదర్శులు వర్షకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ రాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రతి రోజు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీందర్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు మంచి నీటి సరఫరాలో జాగ్రత్తలు వహించాలని ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో అత్యధిక మొక్కలునాటి జిల్లాలో మండలాన్ని ముందంజలో ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో సధాకర్, కార్యదదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నూతన అధ్యక్షుడి ఎన్నిక

సుభాషనగర్, జూలై, 1 : రోటరీక్లబ్ ఆఫ్ జేమ్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, గౌరీశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీక్లబ్ గవర్నర్ హరీస్మరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల అధికారి అశోక్ నూతన అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ జిల్లాలో రోటరీక్లబ్ జేమ్స్ సభ్యులు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వఅధ్యక్షుడు భూలోకం విజయ కాంత్‌రావ్, ప్రాజెక్ట్ చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్, వీరబ్రహ్మం, అనంత్‌కుల కర్ణీ, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించాలని వినతి

నవీపేట,జులై1: ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం తహసీల్దార్ నారాయణను కోరారు. ఈ మేరకు వారు మండల రెవెన్యూ కార్యాలయానికి తరలివెళ్లారు. నవీపేటలోని రాంపూర్ చౌరస్తా నుంచి పాత యూనియన్ బ్యాంకు వరకు పలుచోట్ల వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులతో పాటు దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో తహసీల్దార్ నారాయణ పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు ఫోన్ చేసి రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని తొలగించాలని ఆదేశించారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

నిజామాబాద్‌అర్బన్, జూలై, 1:ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం వినతులు వెల్లువలా వచ్చాయి. నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్‌చక్రవర్తిలు వినతులు స్వీకరించారు. ప్రజావాణికి ఈ వారం 130ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరిస్తూ ఎప్పటికప్పుడు పరిశీలన జరుపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...

మోపాల్ మండలం సిర్పూర్ శివారులోని సర్వే నంబర్ 602లో తనకు ప్రభుత్వం కేటాయించిన 5ఎకరాల భూమిని కొంతమంది కబ్జా చేశారని దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకున్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని నగరానికి చెందిన నిర్మలానందస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

డెయిరీ ఫారం భూమి కబ్జా...

డెయిరీ ఫారం వాటర్‌ట్యాంక్ పక్కన ఉన్న సర్వే 249లో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు, ఇండ్లు కట్టి డూప్లికేట్ పట్టాల ద్వారా అమ్ముకుంటున్నారని, ఆ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అక్బర్‌నవాజ్‌ఉద్దీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆశవర్కర్లకు పారితోషకం లేని టీసీజీ సర్వేను రద్దు చేయాలని రాష్ట్రంలో ఎక్కడ లేని సర్వే ను జిల్లాలో నిర్వహిస్తున్నారని ఆశవర్కర్లకు గౌరవ వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంటును విడుదల చేయాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు.

ముగిసిన ఎస్‌జీటీల బదిలీల ప్రక్రియ

నిజామాబాద్‌అర్బన్, జూలై, 1: జిల్లాలో ఎస్‌జీటీ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ సోమవారం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1320 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.దుర్గాప్రసాద్ ఎస్‌జీటీ బదిలీ ప్రక్రియ ముగిసినట్లు తెలిపారు. ఎస్‌జీటీల బదిలీలకు సంబంధించి వెబ్‌ఆప్షన్లు, తుది జాబిత ప్రకటన ఇటీవల పూర్తయింది. బదిలీల జాబితాను కూడా విద్యాశాఖాధికారులు విడుదల చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు సోమవారం రిలీవ్ అయి తమకు కెటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. కాని చాల మంది ఎస్‌జీటీలు తమ పాతస్థానాల నుంచి రిలీవ్ అయ్యేందుకు వెనుకాడుతున్న ట్లు సమాచారం. దీంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు ఏమి చేయాలో తెలియని పరిస్థితిల్లో ఉన్నారు.

'కార్మికులకు సమగ్రచట్టం తీసుకురావాలి'

కమ్మర్‌పల్లి, జూలై 1: వ్యవసాయరంగ కార్మికులకు సమగ్రచట్టం తీసుకువస్తూ వ్యవసాయ కూలీలకు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగునంగా కనీసం 6 వందల రూపాయల గిట్టుబాటు కూలీ అందజేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల తహసీల్దార్ అంజనేయులుకు అందజేశారు. నల్ల చట్టాలను కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.12వేల ఫించన్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సారా సురేష్, జి కిషన్, సత్తెక్క, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు.

'పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి'

కమ్మర్‌పల్లి, జూలై 1: విద్యార్థులు దోమలవల్ల వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమలవల్ల కలిగేనష్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, తమ ఇండ్లలో దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య విద్యాబోధకుడు కటుకం శంకర్ అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు వ్యాపిస్తాయన్నారు.

ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారుల పనితీరుపై అసంతృప్తి

● కోటగిరి మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

కోటగిరి,జులై1: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య చివరి సమావేశం సోమవారంతో ముగిసింది. మరో రెండు రోజుల్లో పదవి కాలం ముగుస్తుండడంతో పాలకవర్గాన్ని మండల స్థాయి అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. చివరి సమావేశంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన పలు అంశాలపై సభ కొనసాగింది. ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారుల పనితీరుపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఆర్‌అండ్‌బీ అధికారులు మండల రహదారుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ మాట్లాడుతూ పొతంగల్, రుద్రూరు ప్రధాన రహదారిపై కల్వర్టుల వద్ద సైడ్‌వాల్స్ లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైడ్‌వాల్స్ నిర్మించకపోగా కనీసం ప్రమాద సూచికలు తెలియజేసేలా ఏర్పాట్లు చేయకపోవడంతో ఆ శాఖ అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారిందని ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులు సైతం సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని సుంకిని ఎంపీటీసీ సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. సుంకిని, కొల్లూర్ రహదారి నిర్మాణ పనుల్లో విద్యుత్ స్తంభం నేల కొరిగి విద్యుత్ తీగలు కింద పడ్డాయని, సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ తీగలు తగిలి ఎవరైన చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని మరమ్మతుల కేంద్రానికి వెళ్తే అక్కడ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని కోటగిరి ఎంపీటీసీ మనోహర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కోటగిరి ఏఈ విద్యుత్ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఎంఈవో నాగనాథ్ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నారని వివరించారు. విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సభ్యులకు వివరించారు.

ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, జూలై 1 : పార్టీలకు అతీతంగా ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం లక్కాపూర్ వద్ద రూ.71లక్షల నిధులతో ధర్మోరా వాటర్‌ట్యాంక్ ఎత్తిపోతల శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిధుల విడుదలలో ప్రతీ నియోజకవర్గానికి సమానంగా నిధులు మంజూరు చేయాలని, పక్షపాత ధోరణి ఉండకూడదని అన్నారు. ప్రభుత్వం ఇటీవల ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ మోడల్‌స్కూల్‌కు రూ.100కోట్లు మంజూరు చేసి తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టు విక్రమార్క తన మదిర నియోజకవర్గానికి అట్టి పాఠశాలను తరలించుకుపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయాలని, లేనిచో తాను నిరాహార దీక్ష చేస్తానని, తనకు నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో హాస్టళ్లు, పాఠశాలలు దుస్థితిలో ఉన్నాయని విద్యార్థులు ఇబ్బంది లకు గురవుతున్నారని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, జిల్లా నాయకులు గంగోని సంతోష్, గంగారెడ్డి, రాజు, కంచెట్టి గంగాధర్, రమణరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వభూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సిరికొండ, జులై 1 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు, రియల్టర్‌లు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆ వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌కు ఐపీకేఎంఎస్ నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకుడు రమేశ్ మాట్లాడుతూ.. గతంలో ఈ స్థలంలో అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గెస్ట్‌హౌస్‌కు శిలాఫలకం వేశారని, కొందరు రియల్టర్‌లు మాఫీయాగా ఏర్పడి ఈ ప్రభుత్వ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని వారిని అడ్డుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. అధికారులకు స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి తక్షణమే ఆదేశాలు ఇచ్చి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. పోలీస్‌స్టేషన్ ఎదుట గల ఈ ప్రభుత్వ భూమిలో గెస్ట్‌హౌస్ నిర్మించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకుడు ఆశిష్ ఉన్నారు.

వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తపడాలి

● నగర మేయర్ నీతూ కిరణ్


మాట్లాడుతున్న నగర మేయర్ దండునీతుకిరణ్

సుభాష్‌నగర్, జూలై, 1:సీజనల్ వ్యాధుల బారిన పడకుం డా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ దండునీతుకిరణ్ అన్నారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా డేంగీ, మలేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ద్వారా తీసుకోవల్సిన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. నీరు ఎక్కువగా నిలచి ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం,మురికి నాలల పూడిక తీయడం పూర్తి చేశామన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఇండ్ల మధ్య నీరు నిలచినట్లయితే జోన్‌పరిధిలో అధికార యం త్రాంగం అందుబాటులో ఉందన్నారు. అనంతరం నగరంలోని మాలపల్లిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, హమ్మీకాలనీలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పని తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని ధర్నా


ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

రెంజల్,జులై1: మండలంలోని కందకుర్తి గ్రామంలో సోమవారం డబుల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు అందజేయాలని రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో కందకుర్తి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో 50డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొన్ని గదులకు తలుపులు, కిటికిలు, నీటి సౌకర్యం కల్పించకపోవడంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో జాప్యం ఎందుకు జరిగిందని లబ్దిదారులు అక్కడికి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని లబ్దిదారులతో మాట్లాడారు. ఆర్డీవోకు నివేదికను అందజేసి లబ్దిదారుల ఎంపిక విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ప్రజలు వెనుదిరిగారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి.

సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల వినతి

నవీపేట,జులై1: జిల్లాలోని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. తమకు గత నాలుగు మాసాలుగా వేతనాలు అందడం లేదని వారు వాపోయారు. తమకు పీఎఫ్ సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా చూడాలని వారు తమ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,800	రూ.67,100	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కల్కి(3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్ర్కీన్-2 : కల్కి(3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్ర్కీన్-3 : కల్కి(తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
: మహారాజ (4.10)
స్ర్కీన్-4 : కల్కి(తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి(హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కల్కి (తెలుగు) (3.10, 7.00, 10.40)
స్ర్కీన్-2 : కల్కి (తెలుగు) (10.30)
: కల్కి (తెలుగు 3డి) (4.30, 10.15)
స్ర్కీన్-3 : కల్కి (తెలుగు) (1.30)
: కల్కి (3డి తెలుగు) (7.25)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్

బస్సు ఢీకొని ఒకరి మృతి

మోస్రా, జులై1 : మండలంలోని గోవూర్ గ్రామశివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిపై బస్సు ఢీకొనగా ఒకరు మృతిచెందారు. నిజామాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని బాన్సువాడ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన జెల్ల సాయికుమార్ (18)కు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే నిండు ప్రాణం బలైందని మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

నవీపేట, జులై1: మండలంలోని గాంధీనగర్‌లో ఆదివారం రాత్రి ప్రతాప్ లాడ్గే (40) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమ్రి తాలూకా రహతిబాయ్‌గావ్‌కు చెందిన ప్రతాప్ లాడ్గే సంవత్సరంన్నర క్రితం ధర్మాబాద్ దగ్గర రైలు కింద పడడంతో రెండు కాళ్లు కోల్పోయ్యాడని అన్నారు. ఇటీవల కొన్ని మాసాలుగా ప్రతాప్ లాడ్గే తన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని గాంధీనగర్‌లో ఉన్న కోళ్లఫారంలో పనిచేస్తూ అక్కడ నివసిస్తున్నారని అన్నారు. ప్రతాప్ లాడ్గే తనకు రెండు కాళ్లు లేకపోవడంతో మానసికంగా బాధపడే వాడన్నారు. ఆదివారం రాత్రి కోళ్లఫారం వద్ద అతడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య జయశీల లాడ్గే, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు బాధతో యువకుడి ఆత్మహత్య

ఖిల్లా, జూలై 1 : అప్పులు చెల్లించలేక గుర్తుతెలియని మందు తాగి యవకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన రమావత్ శేఖర్ (19) ఆరునెలలుగా నగరంలోని గౌతంనగర్‌లో తన స్నేహితులతో అద్దెకు ఉంటూ ఆర్మీలో పనిచేస్తున్నాడని చెప్పేవాడని పోలీసులకు తండ్రి రమావత్ లింబాద్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ క్రమంలో అతను చేసిన అప్పులు చెల్లించలేక ఆదివారం రాత్రి గుర్తుతెలియని మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడన్నారు. స్నేహితులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

భార్య కాపురానికి రాలేదని భర్త..

మోస్రా, జులై1 : మండలంలోని గోవూర్ గ్రామంలో తన భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. గోవూర్ గ్రామానికి చెందిన పోశెట్టి (24) తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డెడ్‌బాడీ ని బోధన్ మార్చురి రూమ్‌కి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

మురికికాలువలో పడి వ్యక్తి మృతి

ఖిల్లా, జూలై, 1 : ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం నగరంలోని రెండోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రెండోటౌన్ ఎస్ఐ ఎల్.రామ్ తన సిబ్బందితో వెళ్లి కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మృతదేహం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు, ఆధార్‌కార్డు కాని లేకపోవడంతో మృతుడ్ని గుర్తించలేకపోయామన్నారు. ఆచూకీ కోసం 8712659838 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

రక్తదానం చేసిన జూనియర్ డాక్టర్లు

పెద్దబజార్, జూలై, 1:జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని జూనియర్ డాక్టర్లు రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని తెలంగాణ జూనియర్ డాక్టర్లు ఆస్పత్రి తరపున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ 365 రోజులు వైద్యులు సేవలు అందించడానికే కృషి చేస్తారన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులే రక్తదానం చేయడానికి ముందుకు రావడం గర్వకారణమన్నారు. 50యూనిట్స్ రక్తదానం ప్రభుత్వ ఆస్పత్రికి అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బాంక్ విభాగం డాక్టర్ ఇమ్రాన్‌అలీ, జూడ రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ డాక్టర్ సురేష్, కార్యదర్శి డాక్టర్ బెనిటాజోన్స్, వైద్యులు పాల్గొన్నారు.

శ్రద్ధానంద్ గంజ్‌లో డీఎస్ సంతాప సభ

ఖిల్లా, జూలై, 1:సీనియర్ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ సంతాపసభను సోమవారం మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రద్ధానంద్‌గంజ్‌లోని మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు కమల్‌కిషోర్ ఇనాని, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కోశాధికారి ధాత్రిక రాజేందర్, మాస్టర్ శంకర్‌ల ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. వ్యాపారుల కోసం, గుమస్తా, దడ్వాయి, హామాలి, చాటయూనియన్‌ల అభివృద్ధి కోసం డీఎస్. చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గుమస్తా సంఘం, ధడ్వాయి, హామాలి, చాట యూన్లు అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరవాసి రాజేశ్‌కు బుద్దపూర్ణిమ పురస్కారం

సుభాష్‌నగర్, జూలై, 1: సామాజిక సేవను గుర్తించి నగర వాసి రాజేశ్‌యాదవ్‌కు జాతీయ బుద్ధపూర్ణిమ అవార్డును అందజేశారు. సోమవారం కరీంనగర్ జిల్లాలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు అవార్డులను అందజేశారు. ప్రముఖ హాస్యనటుడు ఆర్ఎస్. నందా చేతుల మీదుగా గౌడే రాజేశ్‌యాదవ్ బుద్ధపూర్ణిమ అవార్డును అందుకున్నారు. జిల్లాలో గత కొన్ని ఏళ్లుగా నిరుపేద కుటుంబాలకు సహాయంగా ఉంటున్నాడని ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డు ను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.